# ‘రన్ ఫర్ జీసస్’ ర్యాలీ



రన్ ఫర్ జీసస్ ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 30: మెదక్ సీఎస్ఐ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఉదయం రన్ ఫర్ జీసస్ (యేసు కోసం పరుగు) ర్యాలీని శనివారం నిర్వహించారు. చర్చి నుంచి ప్రారంభమై ర్యాలీ పట్టణంలో పురవీధుల గుండా కొనసాగి చర్చికి చేరుకున్నది. ఈ ర్యాలీలో వందలాది మంది క్రైస్తవులు పాల్గొన్నారు. ఈ ర్యాలీని చర్చి ప్రెసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా శాంతయ్య మాట్లాడుతూ గుడ్ ఫ్రై డే ప్రాముఖ్యత గురించి తెలిపారు. యువతను ఆధ్యాత్మిక మార్గంలో నడిపించడానికి రన్ ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ర్యాలీలో పాల్గొన్న వారిలో సీఎస్ఐ కమిటీ సభ్యులు, సంఘ బాధ్యులు గంట సంపత్, సంశాన్ సందీప్, జాన్సన్, గెలెన్, సువన్‌డగ్లస్, నోబుల్‌సన్, పాస్టర్లు డేవిడ్ జైపాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# పెట్రోల్ బంకును ఢీకొట్టిన లారీ



లారీ ఢీకొట్టడంతో ధ్వంసమైన పెట్రోల్ బంకు

రామాయంపేట, మార్చి 30: లారీ అదుపు తప్పి పెట్రోల్ బంకును ఢీకొన్న ఘటన రామాయంపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పట్టణ శివారులో శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ శివారులోని డి.ధర్మారం రోడ్డులో ఉన్న పెట్రోల్ పంపు వద్ద అర్ధరాత్రి పెట్రోల్ పోసుకునేందుకు వెళ్లిన లారీ అదుపు తప్పి బంకును ఢీకొట్టింది. దీంతో బంకు ధ్వంసమై పెట్రోల్, డీజిల్ అంతా బయటకొచ్చింది. విషయం తెలుసుకున్న బంకు యజమాని వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. ఈ విషయమై రామాయంపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# స్వల్పకాలిక రుణాలు రూ. 9.02 కోట్లు మంజూరు



మాట్లాడుతున్న అధ్యక్షుడు అనంతరెడ్డి

వెల్దుర్తి, మార్చి 30: వెల్దుర్తి సొసైటీ వార్షిక సర్వసభ్య సమావేశాన్ని సంఘం అధ్యక్షుడు అనంతరెడ్డి అధ్యక్షతన సంఘం కార్యాలయ భవనంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సం ఘం ద్వారా 1534 మంది సభ్యులకు స్వల్పకాలిక రుణాలు రూ.9.02 కోట్లు, దీర్ఘకాలిక రుణాలు రూ.57 లక్షలు ఇచ్చినట్లు తెలిపారు. 411 బస్తాల విత్తనాలు, 1506 టన్నుల యూరియా, 1340 టన్నుల కాంప్లెక్సు, 497 బస్తాల పొటాష్ ఎరువులు విక్రయించామన్నారు. ఉమ్మడి వెల్దుర్తి మండలంలో ఏర్పాటు చేసిన 23 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 2023-2024 సంవత్సరానికి 9410 మంది రైతుల నుంచి 3,54,626 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు మురళీ, సంఘం డైరెక్టర్లు పాల్గొన్నారు.

# భార్య మందలించడంతో భర్త ఆత్మహత్య



సయ్యద్ ఇస్మాయిల్ (ఫైల్)

చిలిపిచెడ్, మార్చి 30: భార్య మందలించడంతో పురుగు మందు తాగి భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన చిలిపిచెడ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బండపోతుగల్ గ్రామంలో శనివారం జరిగింది. ఎస్సై షేక్ మహబూబ్ తెలిపిన వివరాల ప్రకారం.. చిలిపిచెడ్ మండలంలోని బండపోతుగల్ గ్రామానికి చెందిన సయ్యద్ ఇస్మాయిల్ (35), నాడియా బేగం భార్యాభర్తలు. మృతుడు మద్యానికి బానిసగా మారి పని చేయడం మానేశాడు. రంజాన్ పండుగ ఖర్చుల కోసం ఏదైనా పని చేయాలని భార్య నాడియా బేగం భర్తను మందలించింది. దీంతో సయ్యద్ ఇస్మాయిల్ పురుగు మందు తాగాడు. ఈ విషయం గ్రామస్తులు నాడియా బేగంకు చెప్పడంతో ఆటోలో జోగిపేట ప్రభుత్వ దవాఖానకు, అక్కడి నుంచి సంగారెడ్డిలోని ఓ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతు పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. నాడియ బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నటు ఎస్సై తెలిపారు.

# అంటరానితనంతో అనేక సమస్యలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై, ఏఎస్సై, ఆర్ఐ

చిలిపిచెడ్, మార్చి 30: కుల వివక్ష పాటిస్తే చట్టపరంగా కేసులు తప్పవని, అంటరానితనంతో అనే సమస్యలు వస్తాయని ఎస్సై షేక్ మహబూబ్ అన్నారు. శనివారం మండలంలోని ఫైజాబాద్ గ్రామస్తులతో కలిసి పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఎస్సీలను అంటారానితనం, ఆలయాల ప్రవేశం, పౌర సరాఫరాలు, పెన్షన్లు తదితరలు వాటి గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంకటేశం, ఏఎస్సై మిస్బోద్దీన్, గ్రామ కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్యను పరిష్కరించండి



మైనంపల్లికి వినతి పత్రం అందజేస్తున్న కేసీఆర్ కాలనీ వాసులు

రామాయంపేట, మార్చి 30: రామాయంపేట శివారులోని కేసీఆర్ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుకు శనివారం వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఎంఎస్‌ఎస్‌వో సభ్యుడు వగ్గు చింటు సాగర్-సంధ్య పెండ్లికి ఆయన హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర కార్యదర్శి చౌదరి సుప్రభాతరావు, మాజీ ఎంపీపీ రమేశ్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జనయాత్ర సభను విజయవంతం చేయాలి

తూప్రాన్, మార్చి 30: ఏప్రిల్ 6న కాంగ్రెస్ నిర్వహించే జనయాత్ర బహిరంగ సభను విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, యావాపూర్ యూత్ అధ్యక్షుడు కుమార్ తెలిపారు. వారితో కుమార్, మహేశ్, భిక్షపతి, భాస్కర్, రాజు ఉన్నారు.

# తాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలి

- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి
- మెదక్ అదనపు కలెక్టర్ రమేశ్






చేగుంట సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ అదనపు కలెక్టర్ రమేశ్

చేగుంట, మార్చి 30: వేసవిలో ప్రజలకు తాగు నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని మెదక్ అదనపు కలెక్టర్ రమేశ్ తెలిపారు. చేగుంటలోని ఎంపీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో తాగు నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మిషన్ భగీరథ నీటిని వృథా చేయవద్దని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ గియానిస్సాబేగం, ఎంపీడీవో చిన్నరెడ్డి, ఎంపీవోలు నరేశ్, ఏఈ వెంకటేశ్, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

**తూప్రాన్‌లో..**

తూప్రాన్, మార్చి 30: గ్రామాల్లో ఎక్కడైనా తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడితే అందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ రమేశ్ అధికారులను ఆదేశించారు. శనివారం తూప్రాన్ మున్సిపల్‌లోని సమావేశ మందిరంలో తాగునీటి ఎద్దడి నివారణకు ఏర్పాటు చేసిన చర్యలపై, మున్సిపల్, గ్రామాల్లో వివిధ దశల్లో ఉన్న పనుల పురోగతిపై ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మరమ్మతులో ఉన్న బోర్లు, చేతి పంపులు, మంచినీటి పైపులైన్ల లీకేజీలు, నూతన పైపులైన్ల నిర్మాణానికి ప్రత్యేక అభివృద్ధి నిధులు (ఎస్‌డీఎఫ్), డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి మున్సిపల్, అన్ని పంచాయతీలకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. ప్రైవేటు బోర్లు, బావులు, ఇతర నీటి వనరుల వివరాలను సేకరించి నివేదికలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వేసవి ముగిసేంత వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

# అంగరంగ వైభవంగా గంగమ్మ బోనాలు



గంగమ్మ జాతరలో పాల్గొన్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, తదితరులు

చిలిపిచెడ్(కొల్చారం), మార్చి 30: కొల్చారం మండలంలోని కిష్టాపూర్‌లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గంగమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి హాజరై, ప్రత్యేక పూజలు చేశారు. ఆమెతో ఎంపీపీ మంజులా కాశీనాథ్, జడ్పీటీసీ మేఘమాల సంతోష్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గౌరీ శంకర్ గుప్తా, మాజీ సర్పంచ్‌లు గోదావరి యాదగౌడ్, యాదయ్య ముదిరాజ్ సంఘం మండల, గ్రామ శాఖ అధ్యక్షులు ఊశయ్య, పోచయ్య, అంజయ్య, దుర్గయ్య పాల్గొన్నారు.

**బీఆర్‌ఎస్ నాయకుడికి ఎమ్మెల్యే పరామర్శ**

చిలిపిచెడ్,మార్చి 30: మండలంలోని గౌతాపూర్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న బీఆర్‌ఎస్ నాయకుడు మాణిక్యరెడ్డిని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి శనివారం పరామర్శించారు. అనంతరం చిలిపిచెడ్ మండలంలోని చిట్కుల్ బద్రియ తండాకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడి కుమారుడికి, కొడిపల్లి మాజీ జడ్పీటీసీ దేవ్లా నాయక్ కుతురుతో శనివారం వివాహం జరిగింది. ఈ వివాహ వేడుకకు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మండల నాయకులతో కలిసి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

# ముగిసిన ‘పది’ పరీక్షలు



నార్సింగిలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

మెదక్ మున్సిపాలిటీ/చేగుంట, మార్చి 30: పదో తరగతి పరీక్షలు ఈనెల 18న ప్రారంభమై శనివారంతో ముగిశాయి. చివరి రోజు సాంఘికశాస్త్రం పరీక్ష సజావుగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా 68 పరీక్ష కేంద్రాల్లో 10,300 మంది విద్యార్థులకు 10,281 మంది హాజరయ్యారు. 19 మంది గైర్హాజరయ్యారని, ప్రైవేట్ విద్యార్థులు 34 మందికి 27 మంది హాజరయ్యారని, జిల్లాలో 99.82 శాతం హాజరైనట్లు డీఈవో రాధాకిషన్ తెలిపారు. అల్లాదుర్గం రేగోడ్, పెద్ద శంకరంపేట, మెదక్, హవేళీఘనపూర్, నర్సాపూర్, కౌడిపల్లి మండలాల్లోని 18 పరీక్షా కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ఆకస్మికంగా తనిఖీలు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడా డిబార్‌గానీ, మాల్‌ప్రాక్టీస్‌కు గానీ పాల్పడలేదని, అంతా సజావుగా సాగిందని ఆయన తెలిపారు.

# మెదక్ జిల్లా వాసికి డాక్టరేట్



రాజేశ్‌ఖన్నా

మెదక్, మార్చి 30 (నమస్తే తెలంగాణ)/పెద్దశంకరంపేట : జిల్లాకు చెందిన రాజేశ్‌ఖన్నా కు జేఎన్‌టీయూహెచ్ డాక్టరేట్‌ను ప్రదానంచేసింది. జేఎన్‌టీయూహెచ్, కాలేజ్ ఆఫ్ ఇం జినీరింగ్ హైదరాబాద్, ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్ విభాగంలో ఫ్యాకల్టీగా పని చేస్తున్న భూత్కూరి రాజేష్ ఖన్నాకు పవర్ ఎలక్ట్రానిక్స్, ఇండస్ట్రియల్ డ్రైవ్స్ స్పెషలైజేషన్‌లో చేసిన పరిశోధనలకు జేఎన్‌టీయూ హైదరాబాద్ డాక్టరేట్‌ను ప్రదానంచేసింది. విద్యుత్తు డిమాండ్‌కు అనుగుణంగా వివిధ రకాల పునరుత్పాదక ఇంధనాలపై ఆధారపడుతున్న ఈ రోజుల్లో డిస్ట్రిబ్యూటెడ్ జనరేషన్ సిస్టమ్స్ అనగా సోలార్, విండ్ ఇతర హైబ్రిడ్ ఎనర్జీ సిస్టమ్స్ ద్వారా పవర్‌ని జనరేట్ చేయడం వాటన్నింటినీ సమర్థవంతమైన పవర్ ఎలక్ట్రానిక్స్ కన్వర్టర్లు, ఇన్వెర్టర్ల ద్వారా ఎలక్ట్రిక్ గ్రిడ్‌కు అనుసంధానించడం, ఎలక్ట్రిక్ గ్రిడ్‌ని వర్చువల్ ఎలక్ట్రిక్ మెషీన్‌గా పరిగణించి, తద్వారా పవర్ అనేది గ్రిడ్ నుంచి డీసీ లోడ్స్‌కి ఎలా ప్రవహిస్తుంది, డీసీ జనరేషన్ నుంచి గ్రిడ్‌కు ఎలా ప్రవహిస్తుంది, ఆ పవర్‌ను వివిధ రకాల పద్ధతులు, టెక్నిక్స్‌తో సమర్థవంతంగా ఎలా కంట్రోల్ చేయవచ్చో ఆధునిక పద్ధతులను సిమ్యులేషన్, ఎక్స్‌పెరిమెంటేషన్ ద్వారా నిరూపించినదుకు డాక్టరేట్ అందజేసినట్లు జేఎన్‌టీయూహెచ్ వర్గాలు తెలిపాయి.

# దేశం గర్వించేలా కీర్తి ప్రతిష్టలు తీసుకొస్తా

## మెదక్ బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు

నర్సాపూర్, మార్చి 30: ఎంపీ ఎన్నికల్లో ఒక్క అవకాశమిస్తే దేశం గర్వించేలా కీర్తిప్రతిష్టలు తీసుకొస్తానని బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి రఘునందర్‌రావు తెలిపారు. శనివారం నర్సాపూర్‌లో బీజేపీ మండల స్థాయి కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ బీజేపీకి ఎమ్మెల్యే, ఎంపీలు లేకున్నా జాతీయ రహదారిని నిర్మించినట్లు తెలిపారు. కాంగ్రెస్‌అధికారంలోకి రాగానే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని మాట తప్పిందన్నారు. ప్రధాని మోదీ జాతీయ రహదారికి రూ.1600 కోట్లతో 765 డీ నిధులు మంజూరు చేశారన్నారు.

**ప్రధానిగా మోదీ హ్యాట్రిక్ ఖాయం**

శివ్వంపేట, మార్చి 30: దేశ ప్రధానిగా మోదీ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు అన్నారు. శివ్వంపేట మండలంలోని జేఎస్‌ఆర్ గార్డెన్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, నర్సాపూర్ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, వల్దాస్ మల్లేశ్‌గౌడ్, మండలాధ్యక్షుడు పెద్దపులి రవి పాల్గొన్నారు.



నర్సాపూర్: సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు



గంజాయి మొక్కలను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

# గంజాయి మొక్కలు స్వాధీనం

మెదక్, మార్చి 30 (నమస్తే తెలంగాణ)/రేగోడ్: రేగోడ్ మండలం ప్యారారం గ్రామంలోని జొన్న పంటలో అంతర్ పంటగా సాగు చేస్తున్న 12 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. వీటి విలువ సుమారు రూ.1.20లక్షలు ఉంటుందన్నారు. రేగోడ్ మండలంలోని పట్టిపోలం తండాకు చెందిన నేనావత్ రామినాబాయిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 16 నుంచి ఇప్పటి వరకు 90 కేసులు నమోదు చేశామన్నారు. 43,700 లీటర్ల మద్యంతో పాటు కల్లును స్వాధీనం చేసుకున్నామన్నారు. దీని విలువ రూ.35.50 లక్షలు ఉంటుందని తెలిపారు. ఎన్నికల సందర్భంగా లైసెన్స్‌దారులు నిబంధనల ప్రకారం మద్యం విక్రయాలు చేయాలని, ఎలాంటి ఎక్సైజ్ క్రైంలు చేయవద్దని హెచ్చరించారు. ఇందుకోసం టోల్‌ఫ్రీ నంబర్ 18004252523, ఎన్నికల టోల్ 1950, మెదక్ ఏసీ నోడల్ 8712658922, నర్సాపూర్ ఏసీ నోడల్ 8712658924 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐ నాగేశ్వర్‌రావు, ఎస్సై మాన్‌సింగ్, హెడ్‌కానిస్టేబుళ్లు సిద్ధయ్య, సర్ధార్ అలీ, రవి, వెంకటేశ్, సురేశ్, వేణు ప్రశాంత్ పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ



గొడువకు కారణమైన స్థలాన్ని పరిశీలిస్తున్న తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి

నిజాంపేట, మార్చి 30: మూడు రోజుల క్రితం నిజాంపేటలో దళిత మాజీ ఉపసర్పంచ్ బాబు వ్యవసాయ పొలానికి వెళ్లే రోడ్డు విషయంలో గొడవ జరిగింది. ఈ మేరకు ఘటనా స్థలాన్ని తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి శనివారం పరిశీలించి, బాధితుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ మూడు రోజుల క్రితం వ్యవసాయ పొలానికి వెళ్లే రోడ్డు విషయంలో బాబును కులం పేరుతో దూషించి, దాడి చేయడంతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు ఫిర్యాదు వచ్చిందని, విచారించామన్నారు. డీఎస్పీతో ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

**చెక్‌పోస్టు తనిఖీ చేసిన డీఎస్పీ**

రామాయంపేట, మార్చి 30: జాతీయ రహదారి దామరచెర్వు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును డీఎ స్పీ వెంకట్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో సిబ్బంది అలర్టుగా ఉండాలన్నారు. ప్రతి వాహనాన్ని కచ్చితంగా తనిఖీ చేయాలన్నారు. ఎన్నికల నిబంధనలు కఠినంగా ఉంటాయని ఎంతటి వారిపైనైనా కేసులు నమోదు చేయాలన్నారు. డీఎస్పీ వెం ట రామాయంపేట సీఐ.వెంకటేశ్, ఎస్సై రంజిత్, భిక్షపతి ఉన్నారు.

# వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

చేగుంట, మార్చి 30: బోనాల్ పోలీసు చెక్ పోస్టు వద్ద దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి వాహనాన్ని ఎన్నికల అధికారులు పోలీసులు శనివారం తనిఖీ చేశారు. వారికి ఎమ్మెల్యే పూర్తిగా సహకరించారు. అనంతరం కరీంనగర్ మాజీ సర్పంచ్ దివంగత అయిలపురం రఘుపతి కుమార్తె వివాహ వేడుకల్లో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయనతో నాయకులు రాజిరెడ్డి, మనోహర్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

# కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ ఏర్పాటు ఖాయం



అల్లాదుర్గం: మాజీ జడ్పీటీసీని బీజేపీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ బీబీ పాటిల్

పెద్దశంకరంపేట, మార్చి 30: ప్రధాని మోదీ ఆధ్వర్యంలో మూడోసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ అన్నారు. శనివారం బీజేపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు కోనం విఠల్ ఆధ్వర్యంలో చీలపల్లి, మూసాపేట, జంబికుంట గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్, ఆయా పార్టీలకు చెందిన 100 మంది యువకులు ఎంపీ బీబీ పాటిల్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ మారుతి, శ్రవణ్‌కుమార్, కృష్ణ ఉన్నారు.

**జహీరాబాద్ అభివృద్ధికి కృషి**

అల్లాదుర్గం, మార్చి 30: జహీరాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ అన్నారు. అల్లాదుర్గంలోని ఐబీ చౌరస్తా వద్ద బీజేపీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అల్లాదుర్గం మాజీ జడ్పీటీసీ మమత బ్రహ్మం పార్టీలో చేరారు. ఈమెకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

**ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి**

రేగోడ్, మార్చి 30: ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ అన్నారు. రేగోడ్‌లోని ఎల్లమ్మ ఆలయంలో పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ అధికార ప్రతినిధి సంగప్ప, జిల్లా కార్యదర్శి అనంతరావు, బిడెకన్న హన్మంతు, అరవింద్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, జిల్లా నాయకులు బ్రహ్మం, చంద్రశేఖర్, సంగమేశ్, సతీశ్‌గౌడ్, ప్రభాకర్, తదితరులు ఉన్నారు.

**ఎంపీ బీబీ పాటిల్ వాహనం తనిఖీ**

పెద్దశంకరంపేట, మార్చి 30: పెద్దశంకరంపేటకు వస్తున్న జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ వాహనాన్ని 161వ జాతీయ రహదారిపై కోళ్లపల్లి పాత టోల్‌ప్లాజా వద్ద శనివారం పోలీసులు తనిఖీలు చేశారు.

# నేడు యధావిధిగా సేవలు

## జిల్లా ఖజానా అధికారి చిన్నసాయిలు

మెదక్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): కలెక్టరేట్‌లోని ఖజానా కార్యాలయంలో ఆదివారం 2023-2024వ ఆర్థిక సంవత్సరం చివరి రోజు కావున సేవలు యధావిధిగా కొనసాగుతాయని జిల్లా ఖజానా అధికారి చిన్నసాయిలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బడ్జెట్ బిల్లులు, ఉద్యోగుల జీతాలు, చెక్కుల జమ లాంటి సేవలందించబడతాయన్నారు. నర్సాపూర్, రామాయంపేట, తూప్రాన్‌లోని ఎస్‌టీవో కార్యాలయాలు కూడా సేవలందిస్తాయని తెలిపారు.

**చాకరిమెట్ల హుండీ ఆదాయం రూ.3,27,358**

శివ్వంపేట, మార్చి 30: మండలంలోని చిన్నగొట్టిముక్ల పంచాయతీ పరిధిలో గల చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి దేవాలయ హుండీని శనివారం లెక్కించారు. 3నెలల 11రోజుల ఆదాయం రూ.3లక్షల 27వేల 358 వచ్చినట్లు ఆలయ ఈవో సార శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో పరిశీలకులు రంగారావు, ఆలయ సిబ్బంది రామకృష్ణ, ప్రకాశ్‌చారీ, గ్రామస్తులు నారాయణరావు, హరిసింగ్‌నాయక్, శంకర్ గౌడ్, చెన్నాపూర్ రాజిరెడ్డి ఉన్నారు.

**ఘనంగా నల్ల పోచమ్మ జాతర**

కౌడిపల్లి, మార్చి 30: మండలంలోని తునికి నల్ల పోచమ్మ జాతర వైభవంగా కొనసాగుతున్నది. శనివారం జాతరలో బండ్ల ఊరేగింపు నేత్రపర్వంగా కొనసాగింది. ఉత్సవాల్లో మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు, నర్సాపూర్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, సిబ్బంది భక్తులకు సకల సౌకర్యాలు, ఎస్సై రంజిత్ రెడ్డి నేతృత్వంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో మోహన్‌రెడ్డి తెలిపారు.

**ఘనంగా హనుమాన్ ఆలయ వార్షికోత్సవం**

చిలిపిచెడ్, మార్చి 30: మండలంలోని జగ్గంపేట గ్రామంలో ఆంజనేయ శివ పంచాయుతన నాగదేవత, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. విగ్రహాలను ప్రతిష్ఠించి, హోమాలు నిర్వహించారు.

**వైభవంగా దుర్గమ్మ, పోచమ్మ అమ్మవార్ల జాతర**



బోనాలు తీస్తున్న మహిళలు

టేక్మాల్, మార్చి 30: మండల కేంద్రంలో అనాదిగా వస్తున్న ఆచారంలో భాగంగా దుర్గమ్మ, పోచమ్మ జాతర శనివారం వైభవంగా ప్రారంభమైంది. మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు.

**ఎవరిపైనా వివక్ష చూపరాదు**

వెల్దుర్తి, మార్చి 30: సమాజంలో అందరూ సమానమేనని, ఎలాంటి భేషజాలు చూపకుండా కలిసిమెలిసి ఉండాలని ఆర్ఐ జయభరత్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ లయక్ అలీ అన్నారు. పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని హస్తాల్‌పూర్‌లో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి అటరానితనం, వివక్ష చూపించవద్దని, అన్ని శుభకార్యాలు, పండుగలు, జాతరలు కలిసికట్టుగా నిర్వహించుకోవాలని సూచించారు. రెండు గ్లాసుల పద్ధతి ఉండరాదని, ఎవరైన వివక్ష చూపితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**క్రమశిక్షణకు మారుపేరు శిశుమందిర్**





మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

రామాయంపేట, మార్చి 30: నాణ్యమైన బోధన, క్రమశిక్షణకు మారు పేరు శిశుమందిర్ అని ప్రధాన ఆచార్యుడు వల్లకాటి లక్ష్మీ నారాయణ అన్నారు. వార్షికోత్సవ చివరి రోజు శనివారం సమావేశం ఏర్పాటు చేసి ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంగమేశ్వర్, ముత్యాలు, పండరీనాథ్, చంద్రశేఖర్‌రావు, శీలం మల్లారెడ్డి, ఏలూరి రవీందర్, పుట్టి మల్లేశం తదితరులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ Experienced Supervisors Needed.
1 year of Waterproofing Experience Required. Contact: Jaya Bharathi Constructions at 8790508663.
NT-10287-AII
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.